పోటీలో పదహారు... ఐదుగురి మధ్య రసవత్తర పోరు

విశాలాంధ్ర-చింతపల్లి :ఈనెల 13న జరగబోవు సార్వత్రిక ఎన్నికలలో పాడేరు శాసనసభ నియోజకవర్గం నుంచి పదహారు మంది అభ్యర్థులు బరిలో ఉన్నప్పటికీ, రసవత్తర పోరు అయిదుగురి మధ్య నెలకుంది. అధికార వైకాపా, ఎన్డీఏ, ఇండియా కూటమి, బీఎస్పీ లతోపాటు స్వతంత్ర అభ్యర్థి మధ్య రసవత్తర పోరు జరగనుంది. అధికార వైకాపా నుంచి మత్స్యరాస విశ్వేశ్వర రాజు, ఎన్డీఏ కూటమి తెదేపా అభ్యర్థిగా గిడ్డి ఈశ్వరి, ఇండియా కూటమి అభ్యర్థిగా శతక బుల్లిబాబు, బీఎస్పీ అభ్యర్థిగా సుర్ల అప్పారావు లతోపాటు కాంగ్రెస్ రెబల్ స్వతంత్ర అభ్యర్థిగా వంతల సుబ్బారావు ల మధ్య హెరాహెరి పోరు సాగనుంది. 16 మంది బరిలో ఉన్నప్పటికీ వీరి మధ్య పోరు రసవత్తరంగా మారే పరిస్థితి కనిపిస్తుంది. మిగిలిన 11 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా వారంతా ప్రధాన పార్టీల అభ్యర్థులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. ప్రధాన పార్టీలకు దీటుగా ప్రచారాలు నిర్వహించి వారి వెన్నులో వణుకు పుట్టిస్తున్నారు. ఈ 11 మంది వలన తమలో ఎవరికి తీవ్ర నష్టం జరుగుతుందో అర్థం కాని అయోమయ పరిస్థితిలో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా వైకాపా తెదేపాల మధ్య హెరాహెరీ పోరు ఉంటుందని భావించినప్పటికీ అదే తరహాలో ఇండియా కూటమి, బీఎస్పీ, కాంగ్రెస్ రెబల్ స్వతంత్ర అభ్యర్థులు కూడా ఓటర్లను ప్రసన్నం చేసుకోవడంలో తామేమి తీసిపోము అన్నట్లుగా ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. శనివారం సాయంత్రం తో ప్రచార పర్వానికి తెరపడినప్పటికీ ఓటర్లను ఆకర్షించేందుకు అభ్యర్థులు, ఆయా పార్టీల శ్రేణులు పడరాని పాట్లు పడుతున్నారు.

వారుపు సంతలో పోటెత్తిన ప్రచారాలు

విశాలాంధ్ర-హుకుంపేట : రావాలి జగన్ అని ప్రజలు పిలువటలేదు కాని జగన్ మళ్లి రావాలని జైల్లో ఖైదీలు పిలుస్తున్నారని మాజీమంత్రి అరకు పార్లమెంట్ అధ్యక్షు డు కిడారి శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రం లో శనివారం వారపు సంతల్లో కూటమి బాలపర్చిన అభ్యార్థి పాంగి రాజారావు, స్వతంత్ర అభ్యర్థితో పాటు మరికొన్ని స్వతంత్ర అబ్యార్థులు వాహనాల్లో నాయకు లు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచారాలు చేపట్టారు.కూటమి అభ్యర్థి రాజారావుకు, స్వతంత అభ్యార్థి అబ్రహం ప్రచారా నికి అధిక సంఖ్య లో ప్రజలు పాల్గొన్నారు. శనివారం తెల్లవారు జాము నుంచి నాయకులు కార్యకర్తల ప్రచా రాలతో శనివారం వారపు సంత పోటెత్తింది. వారపు సంతలో పలు పార్టీల నాయకులు ప్రచారాలు చేస్తుంటే వ్యాపారులు, ప్రజలు మైకుల ధ్వనికి విసుగుచెందారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకుడు మాజీమంత్రి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ గిరిజనులకు ప్రజలు రావాలి జగన్ అనటం లేదు కాని జైల్లో ఖైదీలు మాత్రం జగన్ త్వరాగా రావాలని కోరుతున్నారని పేర్కొన్నారు. ప్రజల సమ స్యలు పరిష్కరించే నాయకుడిని గుర్తించి గెలిపించా లని కోరారు. ప్రచారాల్లో మాయ మాటాలు చెప్పి గెలిచి న తరువాత మర్చి పోయే నాయకుడు చంద్రబాబు కాద ని అలాగే అరకు నియోజకవర్గంలో కూటమి ఇచ్చిన మాటకు కట్టుబడి అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు తెదేపా, బాజాపా, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి ఎటువంటి అసౌకర్యం కలగరాదు

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : ఎన్నికల విధులకు కేటాయించిన సిబ్బందికి ఎటువంటి అసౌకర్యము కలగకుండా అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సాధారణ పరిశీలకులు కె. వివేకానందన్, కలక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం. విజయ సునీత ఆదేశించారు. శనివారము ప్రభుత్వ కళాశాల మైదానంలో ఏర్పాటు చేయనున్న ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని సందర్శించిన కలక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సామగ్రి పంపిణీలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ఎన్నికల అధికారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షం వచ్చినా ఎటువంటి ఇబ్బంది లేకుండా వాటర్ ప్రూఫ్ షామియానా ఏర్పాటు చేయాలని, అవసరమైన ఎక్కువ కౌంటర్లు ఏర్పాటు చేసి ఎన్నికల సామగ్రి సక్రమంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. అదేవిధంగా వారికి తాగునీటి, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలకు సకాలంలో చేరుకొనే విధంగా అవసరమైన రవాణా సదుపాయం కల్పించాలని ఆదేశించారు. ఎన్నికల సామాగ్రి తీసుకువెళ్ళేందుకు అవసరమైన రక్షిత బ్యాగులు కూడా అందించాలని సూచించారు. ఈ సందర్భంగా పంపిణీ కేంద్రంలో చేస్తున్న ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించి తగు సూచనలు జారీచేశారు. ముఖ్యంగా లైటింగ్, సిసి కెమేరాల పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి బి.పద్మావతి, స్థానిక తహసిల్దార్ కళ్యాణ్ చక్రవర్తి, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ, డివిఆర్ఎం రాజు, డిఇఇ అనుదీప్, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారికి అడ్డంగా బోల్తాపడిన టిప్పర్

చింతపల్లి, నర్సీపట్నం ఘాట్ రోడ్‌లో నిలిచిపోయిన ట్రాఫిక్
పోలీసుల చొరవతో పరిష్కరించబడ్డ ట్రాఫిక్
ఊపిరి పీల్చుకున్న ప్రయాణికులు, వాహనచోదకులు

విశాలాంధ్ర-చింతపల్లి : చింతపల్లి నుంచి నర్సీపట్నం వెళ్లే ప్రధాన రహదారి(ఘాట్ రోడ్డు) లో శనివారం అదుపు తప్పిన టిప్పర్ రహదారికి అడ్డంగా బోల్తా పడడంతో చింతపల్లి నుంచి నర్సీపట్నం, నర్సీపట్నం నుంచి చింతపల్లి రాకపోకలు సాగించే వాహనాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ఇరువైపులా అధిక సంఖ్యలో వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. దీంతో వాహన చోదకులు, ప్రయాణికులు ఘాట్ రోడ్డు లోనే గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఆ సమస్యను పరిష్కరించేందుకు స్థానిక ఎస్సై అరుణ్ కిరణ్ తన సిబ్బందితో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని భారీ యంత్రాల సహాయంతో శ్రమించి టిప్పర్ ను రహదారికి అడ్డంగా లేకుండా తప్పించారు. దీంతో గంటల తరబడి వేచి ఉన్న వాహన చోదకులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదానికి గురైన టిప్పర్ ను తొలగించడంతో ట్రాఫిక్ సమస్య పరిష్కారం అయిందని, వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్సై అరుణ్ కిరణ్ అన్నారు.

ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి

రిటర్నింగ్ అధికారి, ఐటిడిఏ పిఓ వి.అభిషేక్

విశాలాంధ్ర-అరకులోయ :సార్వత్రిక ఎన్నికలను విజవంతంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని అరకు అసెంబ్లీ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి వి. అభిషేక్ స్పష్టం చేసారు. అరకులోయ తాహాశీల్దార్ కార్యలయం వద్ద ఇవియం పంపిణీకి చేపట్టిన ఏర్పాట్లను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరకు అసెంబ్లీ నియోజక వర్గంలో 2 లక్షల 47 వేల 402 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. మహిళా ఓటర్లు 1, 26,004 మంది, పురుష ఓటర్లు 1,19,391 మంది, ట్రాన్స్ జెండర్స్ 7 గురు ఉన్నారని చెప్పారు. 4వేల మంది పివిటిజి గిరిజనులను కొత్తగా ఓటరుగా గుర్తించి ఓటరు జాబితాలో చేర్చడం జరిగిందన్నారు. 304 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసామని, ప్రతి పోలింగ్ కింద్రానికి సిటీ సౌకర్యం, విద్యుత్తు, ర్యాంప్, పర్నిచర్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించామని పేర్కొన్నారు. నియోజక వర్గంలోని ఆరు మండలాలను 54 సెక్టార్లుగా విభజించామన్నారు. 1800 మంది పోలింగ్ సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. పోలింగ్ సిబ్బందిని సురక్షితంగా పోలింగ్ కేంద్రాలకు తరలించడానికి అన్ని విధాల రవాణా సదుపాయాలు ఏర్పాటు చేసామన్నారు.

ఇవియంల పంపిణీ ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా కలెక్టర్... అరకులోయ నియోజక వర్గానికి సంబందించిన ఇవియంల పంపిణీ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత పరిశీలించారు. సకాలంలో పంపిణీ ప్రక్రియ పూర్తి చేసి ఎన్నికల సిబ్బందిని సంబంధిత పోలింగ్ కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. పోలింగ్ ప్రక్రియ విజవంతంగా పూర్తి చేయాలని అధికారులను సూచించారు. ఏజెన్సీలో విభిన్న పరిస్థితులు కారణంగా ఉదయం 7.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు పోలింగ్ నిర్వహించాలని చెప్పారు. పోలింగ్ సిబ్బందికి రవాణా సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో తాహాశీల్దారులు సుధాకర్, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలుల వర్ష బీభత్సం...

ఎగిరిపోయిన ఇంటిపై కప్పు రేకులు... ఆదుకోవాలని అభ్యర్థన

విశాలాంధ్ర-చింతపల్లి : ఒకవైపు వేసవి తాపం మరోవైపు వర్ష బీభత్సంతో పాటు ఈదురు గాలుల విధ్వంసానికి ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయి నిరాశ్రయులైన కుటుంబ దీనగాథ శనివారం చింతపల్లి సాయినగర్‌లో చోటు చేసుకుంది. ప్రాథమికంగా అందిన సమాచారం ప్రకారం శనివారం మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై కారు మబ్బులు కమ్మి ఈదురు గాలులతో కూడిన వర్ష స్థానిక సాయి నగర్ వీధిలో నివాసం ఉంటున్న కొర్ర రవికి చెందిన ఇంటి పైకప్పు రేకులు ధ్వంసమై ఇంటిలో ఉన్న వస్తు సామాగ్రి తో పాటు నిత్యవసర సరుకులు నీటితో తడిసి ముద్దయ్యాయి. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ నివసించడానికి ఇల్లు నిర్మించుకుంటే వరుణ దేవుడు చేసిన విధ్వంసానికి ఇంటి పైకప్పు రేగుల ఎగిరిపోయి, ఇంటిలో వస్తు సామాగ్రి, నిత్యవసర సరుకులు తడిసిపోయి ఈ వర్షం తమను నిలువ నీడలేని వారిగా చేసి దిక్కుతోచని స్థితికి చేర్చిందన్నారు. తన కుటుంబాన్ని ఆదుకోవాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.

ఎన్నికల కోడ్ అమలులో ఉండగానే పంచాయతీ పనులు

విశాలాంధ్ర-జీకే వీధి: అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి మండలం జెర్రిల పంచాయతీ పరిధి కొండకించింగి గ్రామం నుండి సత్యవారం గ్రామం వరకు పంచాయితీ నిధుల ద్వారా శనివారం ఉదయం పొక్లిన్ ద్వారా గ్రావెల్ రోడ్డు పనులు జెర్రల సర్పంచ్ విరోజీ నాగరాజు ప్రారంభించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉంది కోడ్ ని ఉల్లంఘిస్తూ జెర్రాల సర్పంచ్ రోడ్డు పనులు ప్రారంభించారు. జెర్ర ల సర్పంచ్ ఎన్నికల కోడ్ ఉల్లంఘన పై తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ముక్కల రమేష్ జిల్లా రిటర్నింగ్ అధికారి భావనకు పిర్యాదు చేయడం జరిగింది ఆమె వెంటనే స్పందించి విచరించి నివేదిక ఇవ్వాలని జీకే వీధి తహసిల్దార్ రత్నకుమార్ ను ఆదేశించారు.

30 కుటుంబాలు వైకాపాలో చేరిక

విశాలాంధ్ర-అనంతగిరి : మండలంలో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైకాపాలో చేరికలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మండల పరిధిలో గల కాశీపట్నం పంచాయతీ లోగల తట్టవలస గ్రామంలో నివసిస్తున్న సుమారు 30 కుటుంబాలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ లో చేరినట్లు మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ మదీనా తెలిపారు. మేమంతా సిద్ధం కార్యక్రమంలో భాగంగా అరకులోయ ఎమ్మెల్యే అభ్యర్థి మత్యలింగం, ఎంపీ అభ్యర్థి తనూజ రాణి, ఎమ్మెల్యే పాల్గొన ఆదేశాల మేరకు కాశీపట్నం పంచాయతీ పరిధిలో మండపర్తి, తట్టవలస గ్రామాలలో పర్యటించడం జరిగిందని ఇందులో భాగంగా తట్టవలస గ్రామంలో 30 మంది పార్టీలో చేరారన్నారు. జగనన్న చేసే సంక్షేమ పథకాలు వల్ల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రజలు మద్దతు పలుకుతున్నారని మదీనా తెలిపారు. ఇప్పటికే వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు నీరాజనం పలుకుతున్నారన్నారు. భవిష్యత్తులో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మరిన్ని అభివృద్ధి పథకాలు చేసే అవకాశం ఉంటుందని ప్రతి ఒక్కరు వైయస్సార్ కాంగ్రెస్ కి ఓటు వేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కన్నమ్మ, సత్యవతి పలు కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర

విలేకరులు కావలెను

కావాల్సిన ప్రాంతం : కొయ్యూరు

సంప్రదించవలసిన నెం : యర్రయ్యరెడ్డి

7989138129,7386603589

రిసెప్షన్ కేంద్రం ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలన

విశాలాంధ్ర-పార్వతీపురం : సాధారణ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్నికల సామాగ్రి స్వీకరణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పరిశీలించారు. ఉద్యాన కళాశాలలో ఎన్నికల సామాగ్రి స్వీకరణ సంబంధించి ఏర్పాట్లను శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సామాగ్రి స్వీకరణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని అన్నారు. జిల్లాలోని నాలుగు నియోజక వర్గాల వారీగా వేసిన శిబిరాలలోని కౌంటర్ల వద్ద టేబుళ్ళు, కుర్చీల ఏర్పాటును పరిశీలించి పలు సూచనలను చేశారు. పోలింగ్ కేంద్రాల సామాగ్రి స్వీకరణ సజావుగా, ప్రశాంతంగా జరిగేలా వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. గాలి, వెలుతురు, తాగునీటి వసతి కల్పించాలన్నారు. టాయిలెట్స్, నియోజక వర్గ శిబిరాల మ్యాప్‌ను అందరికీ సులువుగా తెలుసుకొనే విధంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఈవిఎమ్‌ల భద్రతా, ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు, పనితీరును అందుబాటులో ఉంచిన జనరేటర్ల వివరాలను విద్యుత్ శాఖ ఇఇ పి.త్రినాథ రావును అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా మాక్ డ్రిల్ నిర్వహించాలని అగ్నిమాపక అధికారి కె.శ్రీను బాబును ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్దకు సులువుగా చేరుకొని రాక పోకలకు అంతరాయం కలగకుండా రోడ్డు పనులను చేపట్టాలని పంచాయితీ ఇంజనీరింగ్ అధికారులను సూచించారు. అనంతరం కళాశాల ముందు భాగంలో బస్‌ల పార్కింగ్ స్థలాన్ని గుర్తించి అదే స్థలంలో బస్‌లను నిలుపాలని అన్నారు. ఆయా అధికారులకు అప్పజెప్పిన పనులను సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. ఈకార్యక్రమంలో కంట్రోల్ రూమ్ ఎస్‌డిసి అర్.సూర్య నారాయణ, డ్వామా పిడి కె.రామచంద్ర రావు, డిఆర్‌డిఎ పిడి వై.సత్యం నాయుదు, ఆర్‌ఎస్ డబ్ల్యు ఇంజనీరింగ్ అధికారి ఓ. ప్రభాకర్‌రావు, డిపిహెచ్ ఈఓ కే.జీ.ఎన్. నరసింగ రావు, జిల్లా పంచాయితీ అధికారి బలివాడ సత్యనారాయణ, రోడ్లు మరియు భవనాలు శాఖ ఇంజనీరింగ్ అధికారి ఎస్ వేణుగోపాలరావు, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

193 పోలింగ్ స్టేషన్లో సాలూరు అసెంబ్లీ ఎన్నికలు

350 మంది పోలీస్ సిబ్బందితో ఎన్నికలు సజావుగా జరిగేందుకు ఏర్పాట్లు

విశాలాంధ్ర-సాలూరు టౌన్ : మరో రెండు రోజుల్లో అసెంబ్లీ జనరల్ ఎలక్షన్ కు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు పోలీసులు పగడ్బందీగా బందోబస్తును ఏర్పాటు చేసాము అని అడిషనల్ ఎస్పీ నరేష్ బాబు తెలిపారు. శనివారం రూరల్ సర్కిల్ కార్యాలయంలో మాట్లాడుతూ సాలూరు అసెంబ్లీ నియోజవర్గం 2024 జనరల్ ఎలక్షన్ సందర్భంగా పోలింగ్ తేదీ 13న సాలూరు అసెంబ్లీ పరిధిలో సాలూరు టౌన్ సాలూరు, సాలూరు రూరల్, పాచిపెంట, మక్కువ మండలాల్లో గల అన్ని కలిపి 143 పోలింగ్ లొకేషన్లో 193 పోలింగ్ స్టేషన్లను మొత్తం 26 సెక్టార్లుగా విభజించు కొనడం జరిగింది. ఇందులో ఒక ఎడిషనల్ ఎస్పీ ఆక్టోపస్ నరేష్ బాబు, డీఎస్పీ,ఎస్సీ,ఎస్టీ సెల్ మురళీధర్, సిఐ సాలూరు టౌన్, సిఐ సాలూరు రూరల్ కలుపుకొని ఇన్స్పెక్టర్ స్థాయి అధికారులు7, ఎస్సై స్థాయి అధికారులు 10 మంది, సిఎపిఎఫ్ 12 సెక్షన్లు,11 క్యూఆర్టీ టీంలు,143 పోలింగ్ లొకేషన్ వద్ద సిబ్బంది మొత్తం కలుపుకొని 350 మంది సిబ్బంది బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నారన్నారు. అలాగే 14 పోలింగ్ లొకేషన్‌లను సమస్యాత్మకంగా ఉన్నట్లుగా గుర్తించారు. 10 పోలింగ్ లొకేషన్ లను ఎక్స్ట్రీమిస్ట్ ప్రభావిత పోలింగ్ లొకేషన్లుగా గుర్తించడమైనది. 144 సెక్షన్ అమల్లో ఉంటుంది అని ఎలక్షన్ నియమావళి ప్రకారం పోలింగ్ స్టేషన్ నుండి 100 మీటర్లు మరియు 200 మీటర్ల సంబంధించినటువంటి సూచనలు అందరూ అధికమించకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి, టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వాసు నాయుడు,రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ, టౌన్ ఎస్ఐ సురేష్

వైఎస్ఆర్సీపీ అభ్యర్థి జోగారావు సుడిగాలి పర్యటన

- పార్వతీపురంలో ర్యాలీకు అనూహ్య స్పందన
- ముగిసిన ప్రచారం

విశాలాంధ్ర-సీతానగరం/బలిజిపేట/పార్వతీపురం: ఎన్నికలప్రచారం శనివారంతో ముగిసినందున మూడు మండలాల్లో, పార్వతీపురం పట్టణంలో వైఎస్ఆర్సీపీ అభ్యర్థి అలజింగి జోగారావు చివరిరోజు నిర్వహించిన ప్రచారానికి అనూహ్య స్పందన లభించింది. అభిమానులు, వైఎస్ఆర్సీపీ ప్రజా ప్రతినిదులు, నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, మహిళలు పెద్దఎత్తున పాల్గొని జోగారావుకు హారతులిచ్చి, కుంకుమ బొట్టును పెట్టి ఆశీర్వాదంలు అందజేసారు. మందుగుండు సామాగ్రి కాల్చి, మేళతాళాలతో, తప్పెటగుళ్ళతో ఊరేగింపుగా ప్రచారాన్ని నిర్వహించారు. పార్వతీపురం నియోజకవర్గంలో తాను గతఐదేళ్లుగా చేసిన అభివృద్ధితో పాటు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి అందజేసిన సేవలను గుర్తించి రెండోసారి తనను గెలిపించాలని కోరారు. తనతో పాటు ఎంపీ అభ్యర్థి డాక్టరు తనూజారాణిను కూడా గెలిపించాలని కోరారు. గత ఐదేళ్లుగా చేసిన అభివృద్ధిని చూసి ఓట్లు వేయాలని కోరారు.రాష్ట్రంలో వైఎస్ఆర్సీపీ అదినేత వైఎస్ జగన్మోహన్రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రి చేసేందుకు, తనను రెండో సారి ఎంఎల్ఏగా చేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు.24గంటల్లో ఎన్నికలు ఉన్నందున అంతా కలిసికట్టుగా కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఇదిలాఉండగా పార్వతీపురం జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీను నిర్వహించగా అనూహ్య స్పందన లభించింది. పెద్దఎత్తున ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు, శ్రేయోభిలాషులు, రిజైన్ చేసిన వాలంటీర్లు, గృహసారదులు పెద్దఎత్తున పాల్గొని జై జోగారావు,జై జగన్, జై వైఎస్ఆర్సీపీ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. పలు గ్రామాల్లో పార్టీలో చేరిన వారందరికీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు, రాష్ట్ర టిడ్కోచైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్, మాజీ ఎమ్మెల్యే సవరపు జయమణి రామారావు కొయ్యాన శ్రీవాణి మూడుమండలాల ప్రజా ప్రతినిదులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు, శ్రేయోభిలాషులు యువత పెద్దఎత్తున పాల్గొన్నారు.

నేడు ఉదయం 4గంటల నుండి ఎన్నికల సిబ్బందికి బస్సులు

విశాలాంధ్ర-పార్వతీపురం : జిల్లాలో ఎన్నికల విధులకు హాజరు అవుతున్న సిబ్బందికి ఆదివారం ఉదయం 4 గంటల నుండి బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ అన్నారు. ఈమేరకు శనివారం ఒకప్రకటన విడుదల చేశారు. కురుపాం, సాలూరు, పాలకొండ నియోజక వర్గ కేంద్రాలకు చేరుకొనుటకు బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. ఎన్నికల సిబ్బంది తమ ఎన్నికల ఉత్తర్వులు చూపించి ఉచితంగా బస్సులలో ప్రయాణించవచ్చని ఆయన తెలిపారు.

కుక్కలదాడిలో వృద్ధురాలు మృతి

విశాలాంధ్ర-కురుపాం : జియ్యమ్మవలస మండలం వెంకటరాజపురం గ్రామానికి చెందిన బంటు లక్ష్మి(70)బహిర్భూమికి వెళ్ళగా అకస్మాత్తుగా కుక్కలు గుంపు వచ్చి ఆమెపై దాడి చేశాయి. శరీరమంతా ముక్కలుగా కొరకటంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. ఈ గ్రామంలోనే కాకుండా చుట్టూ గ్రామాల్లో కూడా కొద్ది రోజులుగా కుక్కలు చాలామందిని గాయపరిచాయి. అయినా అధికారులు చర్యలు తీసుకోవడంలేదని గ్రామస్థులు విమర్శిస్తున్నారు.

పలువురు వైఎస్సార్సీపీలో చేరిక

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలోని అప్పయ్యపేట గ్రామానికి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు వైఎస్ఆర్సిపిలో ఎమ్మెల్యే అభ్యర్థి జోగారావు సమక్షంలో శనివారం సాయంత్రం చేరారు వారందరికీ కండువాలు వేసి ఆహ్వానించారు ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బురిడీ కుసుమ కుమారి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వలసబల్లేరులో ఇండియా కూటమి అభ్యర్థి ప్రచారం

విశాలాంధ్ర-కురుపాం : రానున్న ఎన్నికల్లో ఇండియా బ్లాక్ బలపరిచిన సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని సిపిఎంతోనే గిరిజన హక్కులు సాధ్యమని కురుపాం నియోజకవర్గ సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి మండంగి రమణ కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మండలంలో వలసబల్లేరు పంచాయతీలో గల గిరి శిఖర గ్రామాలైనటువంటి ఆగంగూడా, వలస గూడ, వెలగమానుగూడ, చాపరాయి గూడ, వలస బల్లేరు తదితర గిరిజన గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి తమకు ఓటు వేయాలని అభ్యర్థించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి పదేళ్ల పాలనలో రాజ్యాంగానికి విరుద్ధంగా గిరిజనుల హక్కులైనటువంటి అడవులను అటవీ పలసాయాలను దూరం చేస్తూ హక్కులను కాల రాసిందినీ అందువలన గిరిజనులు హక్కులను కోల్పోవలసిన పరిస్థితి వచ్చిందని అన్నారు. ఏజెన్సీలో గిరిజనులకు నూటికి నూరు శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించే జీవో నెంబర్ 3ని రద్దుచేసి గిరిజనులకు ఉద్యోగాలకు దూరం చేసిందని కేంద్రంలో అటువంటి పరిపాలన అందిస్తున్నటువంటి బిజెపి ప్రభుత్వానికి రాష్ట్రంలో ఉన్నటువంటి పార్టీలు పొత్తులు తొత్తులుగా వ్యవహరిస్తున్నాయని ఇటువంటి పార్టీలకు సాగనింపి గిరిజనుల గుంతు చట్ట సభల్లో వినిపిస్తేనే గిరిజనులకు న్యాయం జరుగుతుందని కావున ఇండియా కూటమి బలపరిచిన సిపిఎం పార్టీ అభ్యర్థిలను మద్దతు ఇచ్చి సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు కోరాడ ఈశ్వరరావు, టివి రమణ, అంగధ, వాసు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బంది మూడవ రాండమైజేషన్ పూర్తి

విశాలాంధ్ర-పార్వతీపురం : జిల్లాలో ఎన్నికల విధులకు హాజరు అవుతున్న సిబ్బందికి మూడవ రాండమైజేషన్ పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ తెలిపారు. పార్లమెంటరీ నియోజకవర్గ సాధారణ పరిశీలకులుగా ప్రమోద్ కుమార్ మెహర్ద సమక్షంలో శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రాండమైజేషన్ ప్రక్రియను చేపట్టారు. ఈ ప్రక్రియ అనంతరం సంబంధిత రిటర్నింగ్ అధికారులకు సీల్డు కవర్‌లో పంపించడం జరుగుతుందని ఆయన చెప్పారు. 12ఉదయం కవర్లను విప్పడం జరుగుతుందని, తద్వారా సిబ్బందికి ఏ పోలింగ్ కేంద్రానికి నియమించింది తెలుస్తుందని చెప్పారు. మైక్రో అబ్జర్వర్ ల రెండవ రాండమైజేషన్ ను, ఇవిఎం ల సప్లిమెంటరీ రాండమైజేషన్ కూడా పూర్తి చేసామని ఆయన అన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జి కేశవ నాయుడు, కంట్రోల్ రూం ఇన్ ఛార్జ్ అధికారి, ఎస్ డి సి ఆర్ వి సూర్యనారాయణ, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సాధారణ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

రిటర్నింగ్ అధికారి వి వెంకటరమణ

విశాలాంధ్ర-కురుపాం : 2024సాదారణ ఎన్నికలు నిర్వహణకు సంబంధించి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని కురుపాం ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి వి.వెంకట రమణ తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలోని ఐదు మండలాల్లో 268 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఒక్కో కేంద్రానికి ఆరుగురు సిబ్బంది ని ఎన్నికలు నిర్వహించేందుకు నియమించటం జరిగిందని మొత్తం 1608 మంది విధులు నిర్వహించ నున్నారని మరో 300 మంది రిజర్వు లో ఉంటారని, పోలింగ్ నిర్వహణ సామగ్రి పంపిణీ కోసం డిస్ట్రిబ్యూషన్ 16జనరల్ కౌంటర్ లు,16 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు.పోలింగ్ సామగ్రి , సిబ్బంది తరలింపు కోసం వాహనాలు, రూట్ ఆఫీసర్లు, రక్షణ బలగాలు సిద్ధం చేశామని తెలిపారు. సిబ్బంది కి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.

విశాలాంధ్ర
పేజి : 2
అల్లూరి సీతారామరాజు
పార్వతీపురం మన్యం
ఆదివారం 12, మే 2024

ఎన్డీఏ కూటమి భారీ ర్యాలీ

విశాలాంధ్ర-వి.ఆర్.పురం...అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని విఆర్.పురం రేకపల్లిలలో శనివారం ఎన్డిఏ కూటమి భారీ ర్యాలీ నిర్వహించారు. అభ్యర్థుల రోడ్‌షో ప్రచారానికి అడుగడుగునా పార్టీ శ్రేణులు కార్యకర్తలు ప్రజలు ఘనస్వాగతం పలికారు. పార్లమెంట్ అభ్యర్థిగాపోటీ చేస్తున్న కొత్తపల్లి గీత కమలం పువ్వు గుర్తుకే ఓటు వేయాలని టిడిపి నుండి రంపచోడవరం అసెంబ్లీ స్థానానికి పోటీ చేస్తున్న మామిత్ర పక్షాన బరిలో ఉన్న మిరియాల శిరీషదేవికి సైకిల్ గుర్తుకు ఓట్లేసి గెలిపించాలని అభ్యర్థిస్తూ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్య కర్తలు అభిమానులు పాల్గొన్నారు.

జిల్లాలోని ఓటర్లంతా ఓటుహక్కును వినియోగించుకోవాలి

కలెక్టర్ నిషాంత్ కుమార్

విశాలాంధ్ర-పార్వతీపురం : జిల్లాలోని ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని జిల్లాఎన్నికల అధికారయిన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పిలుపునిచ్చారు. జిల్లాలో ఎన్నికలఏర్పాట్లపై శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మీడియా ప్రతినిధుల సమావేశం ఏర్పాటుచేసారు.ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటును వేయాలనికోరారు. యువత, మహిళలు, పి వి టి జిలు, థర్డ్ జెండర్ ఓటు హక్కు వినియోగానికి ముందుకు రావాలని కోరారు. ఇప్పటివరకు జరిగిన ప్రక్రియ ప్రశాంతంగా జరిగిందని, పోలింగు కూడా సజావుగా జరిగేలా ఏర్పాట్లు జరిగాయన్నారు. ఎన్నికల ప్రచారాలు పార్వతీపురం నియోజకవర్గంలో శనివారం సాయంత్రం 6 గంటలనుండి, ఇతర మూడు నియోజక వర్గాలలో సాయంత్రం 5 గంటల నుండి ఆగిపోయిందన్నారు. జిల్లా వ్యాప్తంగా శనివారం సాయంత్రం నుండి 144 సెక్షన్ అమల్లోకి వస్తుందని జిల్లా కలెక్టర్ అన్నారు. ఇంటింటి ప్రచారం చేసుకోవచ్చని ఆయన చెప్పారు.శనివారం సాయంత్రం 6గంటల సోమవారం సాయంత్రం 7గంటల వరకు మద్యం దుకాణాలు మూసివేయాలని ఆదేశించారు. జిల్లాలో 604 ఎఫ్ ఐ ఆర్ లు నమోదు అయ్యాయని చెప్పారు. పోలీసు శాఖ 276, ఎక్సైజ్ 309, ఉద్యోగులపై 3, రాజకీయ నాయకులపై 4 నమోదయ్యాయని అన్నారు. రెండుకోట్ల రూపాయల విలువగల 61వేల మద్యం సీజ్ చేశామని, 2019 ఎన్నికలలో సీజ్ చేసిన దానికి ఇది పదిరెట్లని వివరించారు. ఇతర ప్రాంతాలనుంచి జిల్లాకు వచ్చిన కార్యకర్త ఎవరు జిల్లాలోఉండరాదన్నారు. నియోజక వర్గంలో ఓటు హక్కు ఉన్నవారు మాత్రమే ఉండాలని ఆయన స్పష్టం చేశారు. లాడ్జిలు, వసతి అతిథి గృహాలను తనిఖీలు నిర్వహిస్తామని ఆయన చెప్పారు. పోలింగ్ కేంద్రాలకు వంద మీటర్ల పరిధి వరకు మాత్రమే వాహనాలను అనుమతించడం జరుగుతుందన్నారు. ఓటరు సహాయానికి వేసే తాత్కాలిక టెంట్లు రెండువందల మీటర్లు తరువాత మాత్రమే వేయాలని, అచ్చట పార్టీల జెండాలు, గుర్తులు, ప్రచారం చేయరాదన్నారు. పోలింగ్ కేంద్రాలు వద్ద సహాయకులను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు 298 వాహనాలను వినియోగిస్తున్నామని చెప్పారు.

ఓటునువేయుటకు ఎపిక్ కార్డు లేదా 12రకాల గుర్తింపు కార్డులు వినియోగించుటకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి అన్నారు. పోలింగ్ కేంద్రాలలోకి సెల్ ఫోన్లు గాని, ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను గాని అనుమతించడం జరగదని స్పష్టం చేశారు.

ఓటరు గుర్తింపు కార్డు లేని ఓటర్లు
ఆధార్ కార్డు,
ఎం.జి ఎన్ ఆర్ఇజిఎస్ జాబ్ కార్డు,
పాస్ బుక్,
హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డు,
డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, స్మార్ట్ కార్డు
పాస్ పోర్ట్ చూపించాలని తెలిపారు.

జిల్లాలో 7,83,440 మంది ఓటర్లు ఉండగా, వారిలో3,82,589 మంది పురుషులు, 4,00,779 మంది స్త్రీలు, 72మంది థర్డ్ జెండర్ ఓటర్లున్నారని తెలిపారు.ఇప్పటి వరకు 7,63,608 ఓటరు స్లిప్ లు పంపిణీ జరిగిందని ఆయన తెలిపారు. జిల్లాలో 4529 మంది ఓటర్లు మృతిచెందినట్లు, 4,776 మంది శాశ్వతంగా వలసలు వెళ్లినట్లు,ఇంటివద్ద లభ్యం కానివారు 10527 మంది ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. పోలింగ్ అధికారులకు తాజా ఓటరు జాబితా అందిస్తామని ఆయన చెప్పారు. జిల్లాలో మొత్తం 1031 పోలింగు స్టేషన్లు ఏర్పాటు చేసామన్నారు. పాలకొండ నియోజక వర్గంలో 287, కురుపాం నియోజక వర్గంలో 268, పార్వతీపురం నియోజక వర్గంలో 233, సాలూరు నియోజకవర్గంలో 243 పోలింగు స్టేషన్లు ఏర్పాటు చేయడం జరిగిందని

చెప్పారు. జిల్లాలో గల 1031 పోలింగు స్టేషన్లులలో 883 పోలింగు స్టేషన్లు సాధారణ పోలింగు స్టేషన్లు, 219 క్రిటికల్ పోలింగు స్టేషన్లుగా గుర్తించి ఏర్పాట్లు చేయడం జరిగిందని, 443 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేసామని ఆయన చెప్పారు. 144 సెక్టార్ లు, 151 రూట్లు ఏర్పాటు చేసారు. 74 పోలింగ్ కేంద్రాల్లో ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులో లేదని ఆయన అన్నారు. పోస్టల్ బ్యాలెట్‌ను ఉద్యోగులు పెద్దసంఖ్యలో ఉపయోగించుకున్నారని కలెక్టర్ అన్నారు. 9258 మంది ఫెసిలిటేషన్ కేంద్రంలోను, 579 మంది హెూమ్ ఓటింగ్‌ను వినియోగించు కున్నారని ఆయన తెలిపారు. పాలకొండ నియోజక వర్గంలో 1921 మంది ఫెసిలిటేషన్ కేంద్రంలోను, 113 మంది హెూమ్ ఓటింగ్., కురుపాం నియోజక వర్గంలో 2498 మంది ఫెసిలిటేశన్ కేంద్రంలోను, 33 మంది హెూమ్ ఓటింగ్., పార్వతీపురం నియోజక వర్గంలో 2194 మంది ఫెసిలిటేషన్ కేంద్రంలోను, 270 మంది హెూమ్ ఓటింగ్., సాలూరు నియోజక వర్గంలో 1446 మంది ఫెసిలిటేషన్ కేంద్రంలోను, 163 మంది హెూమ్ ఓటింగ్., ఇతర జిల్లాలకు చెందిన ఉద్యోగులు 1199 మంది ఫెసిలిటేషన్ కేంద్రంలో వినియోగించు కున్నరని చెప్పారు. సర్వీస్ ఓట్లు 133 అందాయని ఆయన తెలిపారు. ఎన్నికల సామగ్రి పంపిణీ ఆదివారం ఉదయం ప్రారంభమవుతుందని జిల్లా కలెక్టర్ అన్నారు. పార్వతీపురం, పాలకొండ, కురుపాం నియోజకవర్గ కేంద్రాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలోను, సాలూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోను పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేశామని ఆయన వెల్లడించారు. అధికారులు, సిబ్బంది ఆదివారం ఉదయం 7 గంటలకు రిపోర్టు చేయాలని చెప్పారు. ఎన్నికలకు దాదాపు 6,600 మంది సిబ్బంది, 127 మంది మైక్రో అబ్జర్వర్ లను నియమించడం జరిగిందన్నారు. ఎన్నికల అనంతరం ఎన్నికల సామగ్రి స్వీకరణ, స్ట్రాంగ్ రూం లను ఉద్యాన కళాశాలలో ఏర్పాటు చేసారు. ఉద్యాన కళాశాలలో కౌంటింగు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. జిల్లాలో అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో - ములిగూడ, బత్తిలి, భామిని, పి కోనవలస, కోనేరు కూడళ్ళ లోను, గునుపూర్, పద్మాపూర్, దండిగాం, ఆర్ కె బట్టివలస, అదారు వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని కలెక్టర్ చెప్పారు. వీటన్నిటిలో వెబ్ కాస్టింగ్లు ఏర్పాటు చేశామని అన్నారు. ఇదిలా ఉండగా పోలింగ్ ఏజెంట్లకు పోలీస్ వెరిఫికేషన్ అవసరం లేదన్నారు.పోలింగ్ ఏజెంట్స్ నేరుగా పోలింగ్ కేంద్రాల్లోకి చేరుకోవచ్చని, పోలింగ్ కేంద్రాల్లో ప్రిసైడింగ్ అధికారి నియామక పత్రాలను జారీ చేస్తారని ఆయన చెప్పారు.పోలింగ్ ఏజెంట్లకు పోలీస్ వెరిఫికేషన్ అవసరం లేదన్నారు. అయితే పోలింగ్ కేంద్రాల్లో తగాదాలు సృష్టించడం వంటి చర్యలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.

అందరికీ కృతజ్ఞతలు: జిల్లా ఎస్పీ

జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల ప్రశాంత నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని, ఇంతవరకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 13న జరుగనున్న సార్వత్రిక ఎన్నికలకు 1150 మంది పోలీసు సిబ్బంది, ఆరు కంపెనీల కేంద్ర బలగాలను వినియోగిస్తున్నా మని చెప్పారు. 56 స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలు, 138 సెక్టార్ అధికారులను నియమించామని తెలిపారు. ఇప్పటికే జిల్లాల్లో 6,100 మందిపై బైండ్ ఓవర్ కేసులు నమోదు చేశామని చెప్పారు. ఎన్నికలవేళ ఎవరు సమస్యలు, అల్లర్లు సృష్టించారాదని, అల్లర్లు సృష్టించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఓటు లేని ఇతర ప్రాంతాలకు చెందినవారు తక్షణమే జిల్లాను విడిచి వెళ్లాలని స్పష్టం చేశారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అంతా సహకారాన్ని అందించాలని కోరారు.

పోలింగ్ సామాగ్రి తరలింపునకు ఏర్పాట్లు : సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

విశాలాంధ్ర-రంపచోడవరం : ఈనెల 13వ తేదీన జరగబోవు సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల సామాగ్రి పోలింగ్ కేంద్రాల అధికారులకు, సిబ్బందికి రంపచోడవరం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో రిసెప్షన్ సెంటర్ ద్వారా అందజేయడం జరుగుతుందని రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి యస్. ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో తాసిల్దారులతో, సెక్టార్ అధికారులతో, డిప్యూటీ తాసిల్దారులతో అదేవిధంగా ఎన్నికల సామాగ్రి అందజేసే అధికారులతో రిటర్నింగ్ అధికారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 53 రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి యస్. ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 13వ తారీకు జరుగు సార్వత్రిక ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. రంపచోడవరం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో రిసెప్షన్ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని ఈ రిసెప్షన్ సెంటర్లో ఎన్నికల సామాగ్రి ఎన్నికల అధికారులకు ఎన్నికల సిబ్బందికి అందజేయుటకు 23 కౌంటర్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. 399 పోలింగ్ కేంద్రాలలో పర్యవేక్షణ కొరకు ఎక్కడికక్కడ మైక్రో అబ్జర్వర్లను నియమించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

ఎన్నికల సామాగ్రి ఎన్నికల అధికారులకు సిబ్బందికి అందజేసే విధంగా అసెంబ్లీకి, పార్లమెంటుకు వేరువేరుగా ఇంచార్జ నియమించడం జరిగిందని ఆయన తెలిపారు. ఎన్నికల విధులకు వచ్చిన అధికారులకు సిబ్బందికి టిఫిన్, భోజన సదుపాయం ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. పిడిఎంఎస్ యాప్ పర్యవేక్షణ కొరకు ఇన్చార్జిని నియమించడం జరిగిందని ఆయన తెలిపారు. ఎన్నికల విధులకు వచ్చిన అధికారులకు సిబ్బంది ఏ కౌంటర్లో రిపోర్ట్ చేయాలో తెలుసుకునేందుకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి ఇన్చార్జిని కూడా ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి సంబంధించిన సామాగ్రికి సంబంధించిన చెక్ లిస్ట్ సంబంధిత అధికారులు ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఐదు పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన అధికారులను సిబ్బందికి ఒక్కొక్క బస్సు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ రిసెప్షన్ సెంటర్ ఉదయం 6గంటల నుండి ప్రారంభమవుతుందని

అదేవిధంగా ఈ ప్రక్రియ మొత్తం 12 గంటలకు పూర్తయ్యే విధంగా అధికారులను సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. అదేవిధంగా 399 పోలింగ్ కేంద్రాలకుగాను 59 మంది సెక్టార్ అధికారులను, 73 మంది రూట్ అధికారులను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. అనంతరం రిసెప్షన్ సెంటర్‌లోని ఏర్పాట్లను రిటర్నింగ్ అధికారి పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే కె. దేవేంద్రుడు,తాసిల్దారులు నజీముల్లా, కృష్ణ జ్యోతి, ఏవి రమణ, సత్యనారాయణ.చలపతిరావు, నాగమణి, సత్య సులోచన, నాగరాజు, డిప్యూటీ తాసిల్దారులు బి.రాజు, స్వామి,ఎ. సత్యనారాయణ,శివ, శ్రీధర్, చైతన్య, సరిత, వీరభద్రరావు, రవీంద్రబాబు, విశ్వనాథ్, డి ఎల్ పి ఓ రఘునందన్, ఎంపీడీవోలు హరికృష్ణ, వీర కిషోర్, సిడిపిఓ సంధ్యారాణి, ఏయం ఓ శ్రీహరి వివిధ శాఖలకు సంబంధించిన ఎన్నికల విధులకు నియమించిన అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తనూజారాణి ఎదురీత...!

ఇంటికే పరిమితమైపోయిన మామ

అరకు ఎంపీ నియోజకవర్గాన్ని చుట్టేస్తున్న కొత్తపల్లి గీత, అప్పలనర్స

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : వైసీపీ అరకు ఎంపీ అభ్యర్థి డాక్టర్ గుమ్మ తనూజారాణి ఎదురీదుతున్నారు. రాజకీయాలకు పూర్తిగా కొత్తకావడం, భర్త చాటు భార్యగా విమర్శలుండడం ఆమెకు మైనస్‌గా కనిపిస్తోంది. కేవలం తనూజారాణి మామ, సిట్టింగ్ ఎమ్మెల్యే శెట్టిపాల్గుణ ఒత్తిళ్లతోనే సీటు సంపాదించగలిగారని, అంతకు మించి ఇంకేమీ లేదని గిరిజనులే చెబుతున్నారు. పాల్గుణ ఈ ఐదేళ్లలో గిరిజనులకు ఏమీ చేయలేకపోయారని, అక్రమాలకు, అన్యాయాలకు పాల్పడుతూ సొమ్ము కూడేసుకుని విశాఖకే పరిమితమైపోవంతో ఆయన కుమారుడే షాడో ఎమ్మెల్యేగా వ్యవహరించినట్టు ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఆయన తీరుపై విసుగు చెందిన గిరిజనం ఇప్పుడు పాల్గుణ కోడలు తనూజారాణిని కూడా ఎంపీగా ఊహించుకోలే పోతున్నట్టు తెలుస్తోంది. దీంతో వచ్చే ఎన్నికల్లో ఆమెకు పరాభవం తప్పదంటూ వార్తలొస్తున్నాయి. వాస్తవానికి గత ఎన్నికల్లో ఉత్తరాంధ్రలోని మూడు సీట్లూ వైసీపీయే కైవసం చేసుకుంది. ఒక్కఛాన్సివ్వండంటూ జగన్ చెప్పడం, సంక్షేమ పథకాల్ని భారీగా ప్రకటించడంతో అప్పట్లో గెలుపు సునాయాసమైంది. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. ఈ ఐదేళ్లలో వారికి ఒరిగింది శూన్యమని అడవి బిడ్డలు మండిపడుతున్నారు. దీంతో ఇప్పటికే అన్నివిధాలా పరుగులెడుతున్న, సిపిఎం ఎంపీ అభ్యర్థి అప్పలనర్స, బీజేపీ ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీతకే విజయావకాశాలున్నా యంటూ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

ఎంపికలోనే తడబాటుు... అరకు ఎంపీగా డాక్టర్ గుమ్మ తనూజా రాణి ఎంపికలోనే వైసీపీ తడబాటు పడిందని నేతలు చెబుతున్నారు. సిట్టింగ్ ఎంపీ గొట్టేటి మాధవిని తప్పించి, అరకు ఎంపీ సీటును సిట్టింగ్ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పేరును ప్రతిపాదించారు. మారిన సమీకరణాలతో తనూజాకు అవకాశం ఇచ్చినా రాజకీయాల్లో అనుభవం లేని ఆమెకు సీటేంటంటూ స్థానిక వైసీపీ నేతలే పెదవి విరిచారు. సీనియర్లను కాదని, సర్వే ఆధారంగా ఆమెకు సీటివ్వడంలో మామ ఫల్గుణ చక్రం తిప్పారనే విమర్శలొచ్చాయి. ఇప్పుడు తనూజా గ్రాఫ్ పడిపోతోందని, ప్రజలకు తన మొహం చూపించలేక పాల్గుణ పూర్తిగా ఇంటికే పరిమితమైపోయి ఎన్నికల ప్రచారంలోకి వెళ్లడం లేదని పార్టీ నేతలు చెబుతున్నారు. వాస్తవానికి అరకు, పాడేరు, కురుపాం, సాలూరు, రంపచోడవరం, పార్వతీపురం, పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇప్పటికే బీజేపీ అభ్యర్థి కొత్తపల్లి గీత, సిపిఎం అభ్యర్థి అప్పల నర్స కాలికి బలపం కట్టుకుని మండుటెండ ల్లోనూ చుట్టేశారు. కమలం గుర్తుకు ఓటేసి గెలిపించాలని, ఏపీలో పాలన పడకేసిందని, తానొస్తే గిరిజన గ్రామాల్ని అభివృద్ధి చేస్తానని, కూటమి నేతల్నే గెలిపించాలంటూ కొత్తపల్లి గీత అభ్యర్థించారు. మరోవైపు సిపిఎం అభ్యర్థి అప్పలనర్స నిత్యం ప్రజల్లో ఉంటూ ఎన్నికలవేళ మరింత దూకుడుగా ప్రచారం సాగిస్తూ ముందుకు వెళ్తున్నారు. దీంతో వైసీపీ ఎంపీ అభ్యర్థి తనుజరాణి ఎన్నికల ప్రచారంలో బాగా వెనుక పడ్డారనే వార్తలు జోరందుకున్నాయి.

సైకో పోవాలి.... కూటమి రావాలి

ఏపీ అభివృద్ధికి ఎన్‌డీఏతోనే సాధ్యం

ఆఖరిరోజు ఎన్నికల ప్రచారంలో కొత్తపల్లి గీత

విశాలాంధ్ర-రంపచోడవరం : జగన్ లాంటి సైకో పోవాలి.. కూటమి పార్టీలే రావాలి..వచ్చేది ఎన్ఏడీ డబులింజిన్ ప్రభుత్వమే.. అరకు ఎంపీగా కొత్తపల్లి గీతే రావాలి.. అంటూ ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అరకు ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో పోలవరం ప్రాజెక్టు పనులు 80శాతం పూర్తిచేస్తే ఈఐదేళ్లలో జగన్ మాత్రం పట్టించుకోలేకపోయారని మండిపడ్డారు. రివర్స్ టెండరింగ్ పేరిట కాలయాపన చేశారంటూ విమర్శించారు. రంప చోడవరం నియోజకవర్గం ఎటపాక మండలం తోటపల్లి, కూనవరం, వీఆర్ పురం తదితర మండలాల్లో సూర్యతాపాన్ని సైతం లెక్కచేయకుండా కొత్తపల్లి గీత ప్రజలనుద్దేశించి మాట్లాడారు. పోలవరం ముంపు గ్రామాల్లో అనేక సమస్యలున్నాయని అటు తెలంగాణ ఇటు ఆంధ్రకు చెందకుండా అయోమయంలో ఇక్కడ ప్రజలు బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం పూర్తి చేస్తాం... ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పాడిన రెండేళ్లలో పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని బీజేపీ నాయకులు హామీ ఇచ్చినట్టు కొత్తపల్లి తెలిపారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అమ్ముతున్నది మద్యం కాదని, అదో విషం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దుకాణాల్లో డిజిటల్ పేమెంట్లకు ఎందుకు అనుమతివ్వడం లేదని, ఆ డబ్బుని జగన్ తన తాడేపల్లి కేంద్రానికి పంపించేస్తున్నారని ఆరోపించారు. విష మద్యంతో అనేకమంది అనారోగ్యబారిన పడుతున్నారని, వరదలొస్తే సైకో ఆనందిస్తున్నాడనీ, బురద నీళ్ళల్లో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు కనీసం బ్లీచింగ్ కూడా ఇవ్వలేకపోతున్నారన్నారు. గ్రామాలన్నీ బురదమయంగా మారుతున్నా సమస్య పరిష్కారం చూపలేదని ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. పోలవరం జిల్లా కోసం ఏళ్లుగా పోరాడుతున్నా చలించడం లేదని, మీ కోసం ఆలోచించలేదనీ, మీ పిల్లల భవిష్యత్తుతోపాటు ఈ రాష్ట్ర భవిష్యత్తుకు పవన్ కల్యాణ్ పదవుల్ని త్యాగం చేసి మరీ కూటమి ఏర్పాటుకు కృషి చేశారని కొనియాడారు. జగన్‌కు సవాల్ చేస్తూ రానున్న ఎన్నికల్లో ఓటమికి సిద్ధంగా ఉండాలని పవన్ చెప్పడాన్ని గుర్తు చేశారు. ప్రధాని మోడీ ఈ ప్రపంచానికే విశ్వ గురువుగా మారారని, అభివృద్ధిలో భారత్ దూసుకెళ్తోందన్నారు. వీఆర్ పురం మండలంలోని రేఖపల్లి, బీసీ కాలనీని ముంపు మండలాల్లో చేర్చడానికి శాయశక్తులా కృషి చేస్తానని హామీనిచ్చారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో పేదలకు మెరుగైన జీవనం, ఉపాధి అవకాశాలు కలుగుతాయని గీత తెలిపారు.

ఈ ఏజెన్సీలో మరో సైకో... రాష్ట్రంలో అక్కడొక సైకో ఉన్నారని, ఏజెన్సీ ట్యిగర్‌గా ఇక్కడో సైకో చలామణి అవుతున్నారని గీత

ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వారు ప్రచారానికొస్తే తరిమి కొట్టినా సిగ్గు లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రజలందరికీ నమస్కారం చెప్పాలని మోడీ అనకాపల్లి సభలో చెప్పారని గుర్తు చేశారు. ల్యాండ్ టైటిల్ యాక్ట్ తెచ్చి జగన్ మోహన్ రెడ్డి ప్రజల ఆస్తుల్ని లాక్కోడానికి చూస్తున్నాడని, మీ భూములపై ఆయన పెత్తనం చేయాలని చూస్తున్నాడని గీత ఆగ్రహం వ్యక్తం చేశారు. రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే ఉమ్మడి అభ్యర్థి మిరియాల శిరీష కూడా ప్రసంగించారు.

తోటపల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-గరుగుబిల్లి: పార్వతీపురం మన్యం జిల్లా మండల పరిధిలోని తోటపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రం ఉత్తరాంధ్ర చినతిరుపతిగా పేరుగాంచిన తోటపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజాకార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాత సేవ ఆరాధన మంగళ శాసనములు విశేష హెూమములు తదితర పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు వివి అప్పలాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీవెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. అదే విధముగా తోటపల్లి వాస్తవ్యులు ఓలేటి గౌరునాయుడు కుమారుడు గగన్ పుట్టినరోజు సందర్భంగా భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. ప్రస్తుతం ఎండలు తీవ్రత దృష్ట్యా చల్లని మజ్జిగను భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది గంట శ్రీధర్ నాయుడు మార్కొండ మురళినాయుడు పెదారపు పోలిరాజు ఓలేటి గంగునాయుడు, మార్కొండ సీతంనాయుడు, గౌరునాయుడు, పకీరు నాయుడు, తామాడ దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

విశాలాంధ్ర-రంపచోడవరం : ఈనెల 13వ తారీకు జరుగు సార్వత్రిక ఎన్నికలకు ఎన్నికల విధులకు వచ్చిన అధికారులకు సిబ్బందికి సంబంధించిన వాహనాలు ట్రాఫిక్ జామ్ కాకుండా ఎక్కడికక్కడ వాహనాల పార్కింగ్ లు ఏర్పాటు చేయడం జరిగిందని 53 రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి యస్. ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం స్థానిక సబ్ కలెక్టర్ వారి కార్యాలయ చాంబర్లో 53 రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి యస్. ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 13వ తారీకున జరుగు సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన అధికారులు సిబ్బంది వారి వారి సొంత వాహనాలు నాలుగు చక్రాల వాహనాలు, రెండు చక్ర వాహనాలు పార్కింగ్ తీసుకునే విధంగా ఆర్టీసీ కాంప్లెక్స్ వెనుక ఖాళీ స్థలంలో పార్కింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. అదేవిధంగా సెక్టార్ అధికారులకు సంబంధించిన వాహనాలు లెనోరా ఆసుపత్రి ప్రాంగణంలో పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. అదేవిధంగా ఎన్నికలు నిర్వహించే ప్రొసీడింగ్ అధికారులకు, అసిస్టెంట్ ప్రొసైడింగ్ అధికారులకు, ఇతర ఎన్నికల సిబ్బందికి పోలింగ్ కేంద్రాలకు తరలించే బస్సులు, బొలెరో వాహనాలు ప్రభుత్వ జూనియర్ కాలేజీ దగ్గర ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లోనే ఏటపాక, చింతూరు, వి ఆర్ పురం, కూనవరం, వై రామవరం మండలాలకు సంబంధించిన వాహనాలకు పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. అదేవిధంగా రంపచోడవరం, దేవీపట్నం, గంగవరం, రాజవొమ్మంగి, అడ్డతీగల మండలాలకు సంబంధించిన వాహనాలను లెనోరా కాలేజీ ప్రాంగణంలో వాహనాలకు పార్కింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని రిటర్నింగ్ అధికారి తెలిపారు. ఈనెల 13వ తారీకు జరుగు సార్వత్రిక ఎన్నికలకు వచ్చిన అధికారులకు సిబ్బందికి ఎటువంటి ఇబ్బంది లేకుండా వారి వారి వాహనాలకు ఎక్కడికి అక్కడ ట్రాఫిక్ ఇబ్బందిలు లేకుండా పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయడం జరిగిందని అదేవిధంగా ఈ ఎన్నికలు నిర్వహించుటకు వచ్చు అధికారులు సిబ్బంది ఈ పార్కింగ్లను సద్వినియోగపరుచుకోవాలని అదేవిధంగా గమనించగలరని రిటర్నింగ్ అధికారి తెలియజేయడం జరిగింది.

టిడిపి, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించండి

ఎంఎల్ఏ అభ్యర్థి విజయ్ చంద్ర

పార్వతీపురం కేంద్రంలో భారీ ర్యాలీ

విశాలాంధ్ర-పార్వతీపురం/సీతానగరం/బలిజిపేట: టిడిపి, బిజెపి ,జనసేన ఉమ్మడిపార్టీల అభ్యర్థులను అత్యధికమెజార్టీతో గెలిపించాలని కోరుతూపార్వతీపురం నియోజకవర్గం ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి బోనెల విజయ్ చంద్రలు పిలుపునిచ్చారు. శనివారం ప్రచారం ముగియ డంతో మూడు మండలాల్లోని పలు గ్రామాల్లో సుడిగాలి పర్యటనతోప్రచార కార్యక్ర మాన్ని నిర్వహించారు. మేళ తాళాలతో, తప్పెట గుళ్ళతో, డప్పులతో వారిద్దరికీ ఘన స్వాగతం పలికారు. మహిళలు కుంకుమునుదిద్ది, హారతు లిచ్చి ఆశీస్సులు అందజేశారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి చేసేందుకు తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని, నరేంద్ర మోడీని మూడోసారి ప్రధానమంత్రిగా చేసేందుకు తననుఎంపీగా గెలిపించాలని కొత్తపల్లి గీతలు కోరారు.అంతాకష్టపడి పని చేయాలని కోరారు. టిడిపి బీజేపీ ఉమ్మడి పార్టీల మేనిఫెస్టోను వివరించారు. వైఎస్ఆర్సిపి

హయాంలో రాష్ట్రం అన్ని రంగాలలో వెనుక బడినట్లు, పార్వతీపురం నియోజకవర్గంలో కూడా గత ఐదేళ్లుగా జరిగిన అభివృద్ధి ఏమీలేదని తెలిపారు. ఎన్నికలు దగ్గర పడుతున్న అంతా కలిసికట్టుగా కష్టపడి పనిచేసే పార్టీ అభ్యర్థులను మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మూడు మండలాల్లోని టిడిపి నాయకులు బోను చంద్రమౌళి, గొరజాన చంద్రమౌళి, గొట్టాపు వెంకటనాయుడు, గుంట్రెడ్డి రవికుమార్, మజ్జి వెంకటేష్, మజ్జి కృష్ణమోహన్, బార్నాల సీతారాం, జయబాబు, పెంట సత్యం నాయుడు, రౌతు వేణుగోపాల నాయుడు, సాల హరిగోపాల్ శ్రీనివాసరావు, పెంకివేణునాయుడు, రవి, జగన్మోహన్, నాని తదితరులు పాల్గొన్నారు. పార్వతీపురం కేంద్రంలో పాత బస్ స్టాండ్ నుండి వైఎం వరకు పురవీదులగుండా అంతా పసుపు మయమయింది. మూడు మండలాల టీడీపీ క్యాడర్ తరలివచ్చి భారీర్యాలీ చేపట్టారు.టీడీపి జిందాబాద్, జనసేన జిందాబాద్, బీజేపి జిందాబాద్ ,చంద్రబాబు జిందాబాద్ అంటూ జెండాలు పట్టుకుని నినాదాలు చేస్తూ ర్యాలీచేపట్టారు.ఇదిలాఉండగా పలు గ్రామాల్లో చేర్పులు కూడా జరిగాయి. పార్టీలోకి వచ్చిన వారికి విజయ్ చంద్ర కండువాలు కప్పి ఆహ్వానించారు. ప్రచార కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు శ్రేయోభిలాషులు మహిళలు యువతీయువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గత ఐదేళ్లలో ఎనలేని అభివృద్ధి చేశా

- అభివృద్ధిని చూసి ఓటువేయండి

కుర్పో వైయస్సార్సీపి ఎంఎల్ఏ అభ్యర్థి పాముల పుష్పా శ్రీవాణి

విశాలాంధ్ర-పార్వతీపురం/కురుపాం : కురుపం శాసనసభ నియోజకవర్గంలో గత ఐదేళ్లుగా తానుచేసిన అభివృద్ధిని చూసి ఓటువేయాలని కురుపాం వైయస్సార్సీపి అభ్యర్థి పాముల పుష్పశ్రీవాణి, జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజులు తెలిపారు. శనివారం పలు గ్రామాల్లో జరిగిన ప్రచారంలో వారు సుడిగాలి పర్యటన చేశారు. ప్రచారం ముగింపు సమయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో వైయస్సార్సీపి అధినేత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పెద్దఎత్తున అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను అమలు చేసి రాజకీయాల కతీతంగా అర్హులందరికీ అందజేస్తారన్నారు. ఎటువంటి లంచాలకు తావులేకుండా నేరుగా లబ్దిదారులకు పథకాలను వారి వారి బ్యాంకుఖాతాల్లోకి జామచేసిన ఘనత వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధి సంక్షేముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి రెండు ఓట్లను సీలింగు ఫ్యాన్ కు వేయాలని కోరారు. తనతోపాటు ఎంపీగా పోటీ చేస్తున్న డాక్టర్ తనూజరానికి ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గత పదేళ్లుగా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నట్లు తెలిపారు. గిరిజన అభివృద్ధికి ఎనలేని కృషి చేసినట్లు తెలిపారు.కురుపాం నియోజకవర్గంలో దశాబ్దాల కాలంగా నోచుకోని అభివృద్ధి నాలుగున్నర సంవత్సరాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పరిపాలన లో విద్యా, వైద్యం, రహదారులు, త్రాగునీటి సౌకర్యాలు ఏర్పాటుతో అభివృద్ధి పరుగులు పెట్టించామన్నారు. అలాగే ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా తలుపు తట్టీ సంక్షేమ పథకాలు అందించినఘనత వైసీపీ ది మాత్రమే.. అదే మాకు శ్రీరామ రక్ష లా ఓటుబ్యాంకు చెదిరిపోకుండా కాపాడుతుందని ధీమా వ్యక్తం చేశారు.సంక్షేమ పథకాలు ద్వారా లబ్ది చేకూరుతుందని భావిస్తే మరోసారి ఫ్యాన్ గుర్తు పై ఓటు వేసి ఆశీర్వదించాలని కోరుతున్నామని తెలిపారు.రాజకీయాల్లో పుకార్లు, విమర్శలు సర్వసాధారణం అని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నదే మా విశ్వాసం అంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. రెండోసారి ముఖ్యమంత్రిగా వైయస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక గుమ్మడి గెడ్డ రిజర్వాయర్ ,పూర్ణపాడుబిలాబేసు వంతెన నిర్మాణాలు పూర్తి చేస్తామని తెలిపారు.

అభివృద్ధికి చిరునామాగా కురుపాం నియోజక వర్గంగా తీర్చిదిద్దినట్లు ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్తు రాజులుఅన్నారు.కురుపాంలో 150కోట్లతో జెఎన్టియు గిరిజన ఇంజనీరింగ్ కళాశాల , అగ్రికల్చర్ ల్యాబ్, 8కోట్సాలతో కురుపాం, గుమ్మ లక్ష్మి పురం సామాజిక ఆరోగ్య కేంద్రాలకు నూతన భవనాలు, ఏకలవ్య పాఠశాలలు,గ్రామ సచివాలయ భవనాలు, హెల్త్ వెల్నెస్ సెంటర్లు, రైతు భరోసా కేంద్రాలు, నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు కార్పోరేట్ స్థాయి అభివృద్ధి , జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు తో గిరి శిఖర గ్రామాలకు బి.టి రహదారులు ,జలజీవన్ మిషన్ ద్వారా రక్షిత మంచినీటి పథకాలు, ఈఐనిధులు తో ప్రత్యేక అభివృద్ధి ఇలా 1045 కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులు, మునుపెన్నడూ లేని విధంగా చేపట్టడం జరుగిందని ఇది కాదా అభివృద్ధి అంటే అభివృద్ధి చూసి మరోసారి ఫ్యాన్ గుర్తు పై ఓటు వేయాలని కోరారు.కురుపాం నియోజకవర్గంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు 615529 మంది లబ్దిదారులకు సుమారు 17వందలకోట్లరూపాయలు వ్యక్తి గత ఖాతాలో జమ చేయడం జరిగిందని , ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది ద్వారా పథకాలు అందజేసామన్నారు. గతంలో ఎన్నడు చేయని అభివృద్ధి తన హయాంలో చేసినట్లు తెలిపారు. తన భర్త పరీక్షిత్ రాజ్ అందించిన సహకారం గొప్పదని తెలిపారు. ఇద్దరం కలిసి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రజలు మూడోసారి తనకు అవకాశాన్ని ఇవ్వాలని కోరారు. నియోజకవర్గంలో కష్టంలో ఉన్నవారికి అండగా ఉచిత అంబులెన్సు సేవలను అందజేస్తున్నట్లు తెలిపారు.అత్యవసర పరిస్థితుల్లో నియోజకవర్గంలో నిరుపేదలకు సహాయపడే విధంగా స్వంత నిధులుతో ఏర్పాటు చేసిన జగతి ఉచిత అంబులెన్సు సేవలకు మంచి స్పందన లభిస్తుందన్నారు. తమ లక్ష్యం, ఆశయం కురుపాం నియోజకవర్గఅభివృద్ధిఅని, దాని కోసం నిరంతరం కష్టపడి పనిచేశామన్నారు. ఓటర్లు విజ్ఞతతో ఆలోచించి తమకు అవకాశాన్ని ఇస్తారనే ధీమాను వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో ప్రజల ఆశీస్సులతో ముచ్చటగా మూడోసారి గెలుపుకూడా తథ్యమనే ధీమాను వ్యక్తం చేశారు.